క్లుప్తంగా

నేడు మల్లవోలులో ప్రజాదీవెన యాత్ర

గూడూరు: మండలంలోని మల్లవోలులో బుధవారం ప్రజాదీవెన యాత్ర నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు పర్లం పెదబాబు తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి పార్టీ పెడన అభ్యర్థి ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తారని ఆయన వెల్లడించారు. పార్టీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఆటిజం బాధితులకు ఫిజియోథెరపీతో ఉపశమనం



కృత్తివెన్ను: ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని మంగళవారం మండల పరిధిలోని నీలిపూడి భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.కె.డి.వి.ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం–2016 ప్రకారం 21 వైకల్యాల్లో ఆటిజం కూడా ఒకటని ఎంఈఓ అన్నారు. పిల్లల్లో వయస్సుకు తగిన మానసిక పరిపక్వత లేకపోవడాన్ని ఆటిజం అంటారన్నారు. ఆటిజం బారిన పడిన పిల్లలను జాగ్రత్తగా గమనించాలని సూచించారు. వారికి ఫిజియోథెరపీ ద్వారా కొంత ఉపశమనం కలిగించవచ్చని పేర్కొన్నారు. సమగ్రశిక్ష ద్వారా అందించే పథకాలన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు నిరుపమ, వరుణ్ బాబు, హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు శంకరరావు, లావణ్య, సీఆర్పీలు తంబిబాబు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా అందె శ్రీరామమూర్తి



అందె శ్రీరామమూర్తి

అవనిగడ్డ: కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వేకనూరుకు చెందిన అందె శ్రీరామమూర్తిని ప్రకటించారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కె.సి.వేణుగోపాల్ పేరుతో మంగళవారం ఓ లేఖను విడుదల చేశారు. ప్రస్తుతం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా ఉన్న ఆయన గత శాసనసభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

గాయపడిన మహిళను ఆస్పత్రిలో చేర్చిన పేర్ని కిట్టు



మచిలీపట్నంటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను తన కారులో ఆస్పత్రికి తరలించి వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఔదార్యాన్ని చాటుకున్నారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయం విధి నిర్వహణ అనంతరం బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళా ఉద్యోగి ప్రమాదానికి గురై గాయాలతో రోడ్డు పక్కన నిస్సహాయ స్థితిలో పడి ఉండటాన్ని అటుగా వెళుతున్న పేర్ని కిట్టు గమనించారు. ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న ఆయన వెంటనే ఆమెను తన కారులో ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందేలా చూశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో పలు వార్డుల్లో చికిత్స పొందుతున్న వారిని పలుకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



గూడూరు:గూడూరు మండలం మల్లవోలు గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు మంగళవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. గ్రామంలో మొత్తం 37 మంది విధులు నిర్వహిస్తుండగా 34 మంది తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి టి.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగున్నర సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్న తమపై ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలతో మనోవేదనకు గురయ్యామన్నారు. పింఛన్లు పంపిణీ చేయకుండా తమను అడ్డుకోవడం బాధకలిగించిందని తెలిపారు. ఇంటి నుంచి బయటకు రాలేని అవ్వాతాతలు, దివ్యాంగులకు తమ వంతు సేవలను అందిస్తున్న తమను విధులకు దూరం చేయడం దారుణమన్నారు. రాజకీయ కారణాలతో తమతో వ్యవహరించిన తీరుతో మనస్తాపం చెంది రాజీనామా చేశామని వివరించారు.

అవకాశం ఇవ్వండి.. మంచి చేస్తాం

- రెండు ఓట్లూ ఫ్యాను గుర్తుకు వేయండి
- మంచి ప్రభుత్వానికి అండగా నిలవండి
- పెడన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్



కొంకేపూడిలో ప్రచారం నిర్వహిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న ఉప్పాల రమేష్, హారిక

పెడన: 'ఒక్కసారి నాకు.. మరో సారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం ఇవ్వండి. మరింత మంచి చేసి చూపిస్తాం' అని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ అభ్యర్థి ఉప్పాల రమేష్ (రాము) అన్నారు. ఆయన మండల పరిధిలోని కొంకేపూడి, ఈదుమూడి, కట్లపల్లి గ్రామాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను ఆలకిస్తూ, వాటిని పరిష్కరిస్తామని భరోసా ఇస్తూ ముందుకు సాగారు. ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు రాము, హారికకు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉప్పాల రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, తన తండ్రి రాంప్రసాద్ దృఢసంకల్పతో పెడన ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగిన తనను ఆశీర్వదించాలని కోరారు. 'మీ బిడ్డగా అక్కున చేర్చుకుని అఖండ మెజార్టీతో గెలిపించండి. మీ అబ్బాయిగా మీ ముందుకు వచ్చాను. ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ ఫ్యాను గుర్తుకు వేసి ఆశీర్వదించండి' అని కోరారు.

టీడీపీ ఫిర్యాదుల వల్లే పింఛన్ల సమస్య

పింఛన్లు విషయమై పలువురు అవ్వాతాతలు అడిగిన ప్రశ్నకు రాము సమాధానమిస్తూ.. వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయనీయొద్దని ఎన్నికల సంఘానికి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో పింఛన్లు అందని దుస్థితి వచ్చిందన్నారు. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రావాలని, అందుకు ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని సూచించారు. జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామన్నారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము)ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, ఎంపీపీ రాజులపాటి వాణి, సర్పంచ్ దావు బైరవలింగం, మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, పార్టీ నాయకులు అచ్చుతరావు, వెంకటరామానాయుడు, వ్యవసాయ సలహా సంఘ మండల చైర్మన్ కాగిత వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దివ్యాంగులపైనా కనికరం లేదా..?



దాక్షాయణి



శివనాగ పార్వతి



శీలం సుబ్బమ్మ

నాగాయలంక: వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకున్నవారిపై దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఒకరి సాయం లేనిదే గడప దాటలేని తాము సచివాలయాలకు వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకోగలమని ప్రశ్నిస్తున్నారు. మండలంలోని మర్రిపాలెం గ్రామానికి చెందిన పలువురు దివ్యాంగులు ఎన్నికల సంఘం ఉత్తర్వులపై ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బుద్ధి మాంద్యం, అంగవైకల్యంతో బాధ పడుతున్న తన 21 ఏళ్ల కుమార్తె దాక్షాయణిని పింఛన్ కోసం సచివాలయానికి ఎలా తీసుకెళ్లాలని సనకా వెంకటేశ్వరరావు ఆవేదన చెందారు. చంద్రబాబు పాలనలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్ద మండుటెండలో పడిగాపులు కాయాల్సి వచ్చేదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్లు ఇస్తుండటంతో తమ ఇబ్బందులు తొలగాయని రెండు కాళ్లూ పనిచేయని 24 ఏళ్ల సనకా శివనాగ పార్వతి పేర్కొంది. వలంటీర్లను నిలిపేయడంతో మళ్లీ సచివాలయం వద్ద పడిగాపులు కాయక తప్పదని వాపోయింది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాజకీయాలకు కోసం తమలాంటి పేదలను ఇబ్బందులు పెట్టడం తగదని గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన దివ్యాంగురాలు శీలం సుబ్బమ్మ పేర్కొంది. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను ఇలా అడ్డుకోవడం దుర్మార్గమని వాపోయింది. తనకు కాలు పనిచేయదని, సచివాలయానికి వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకోవాలని ప్రశ్నించింది. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకున్న చంద్రబాబు కూటమికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని పింఛన్ లబ్ధిదారులు హెచ్చరిస్తున్నారు.

విలువల్లేని బుద్ధప్రసాద్‌కు సహకరించేది లేదు

ఘంటసాల మండల జనసేన నాయకులు

ఘంటసాల: విశ్వసనీయత, విలువలు లేని మండలి బుద్ధప్రసాద్‌కు సహకరించేది లేదని ఘంటసాల మండల జనసేన నాయకులు తేల్చిచెప్పారు. ఘంటసాలలో మంగళవారం రాత్రి వారు మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి పొత్తులో భాగంగా అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సీటును జనసేనకు కేటాయించారని పేర్కొన్నారు. టీడీపీలో ఉన్న మండలి బుద్ధ ప్రసాద్ జనసేనకు టికెట్ కేటాయిస్తే ఓడిపోతారని పలుదఫాలుగా సమావేశాలు ఏర్పాటు చేయడమే కాక ఆ పార్టీలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర సంఘాల అందరితో నిరసనలు, రాజీనామాలు చేయించారని గుర్తు చేశారు. పదవుల కోసం పార్టీలు మారను, కండువాలు మార్చను అంటూ ఊదరగొట్టిన బుద్ధప్రసాద్ నేడు విశ్వసనీయత, విలువలను మరచి జనసేన తీర్థం పుచ్చుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సీనియర్ నాయకుడైన బుద్ధ ప్రసాద్ జనసేనలో చేరే సమయంలో కనీసం నియోజకవర్గంలోని జనసేన నాయకులతో చర్చించలేదని పేర్కొన్నారు. పదవిపై వ్యామోహంతో హడావిడిగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో కండువా కప్పించుకోవడం సిగ్గు చేటని ఎద్దేవాచేశారు. జనసేన ఓడిపోతుంది అంటూ ప్రచారం చేసిన బుద్ధ ప్రసాద్ నేడు ఆ పార్టీ అభ్యర్థిగా ఎలా పోటీ చేస్తారని ప్రశ్నించారు. పదవి కోసం ఇంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్న ఆయన్ను ఘంటసాల మండలం జనసేన నాయకులు, కార్యకర్తలు అందరూ వ్యతిరేకిస్తున్నామని, ఎలాంటి సహకారం అందించబోమని తెగేసిచెప్పారు. తాము పార్టీకి వ్యతిరేకం కాదని, బుద్ధ ప్రసాద్‌ను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని, పవన్‌కల్యాణ్ పునరాలోచన చేసి అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే సీటును జనసేనలో మొదటి నుంచి కష్టపడుతున్న వారికే కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో జన సేన ఘంటసాల మండల ఉపాధ్యక్షుడు కొల్లిపల్లి కిరణ్, ఎంపీటీసీ సభ్యుడు కుమార్ రాజా, మండల పార్టీ కన్వీనర్ యార్ల శ్రీకాంత్, కొండవీటి శ్రీనివాస్, పెంటేటి ప్రవీణ్, ఆకుల మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు దూరంగా జనసేన నేతలు



బుద్ధప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు

అవనిగడ్డ: జనసేన కండువా కప్పుకొని అవనిగడ్డ వచ్చిన మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు స్వాగతం పలికేందుకు ఒక్క జనసేన నేత రాలేదు. టీడీపీ నేతలే ఆయనకు స్వాగతం పలికారు. పిఠాపురంలో పవన్‌కల్యాణ్ సమక్షంలో సోమవారం జనసేనలో చేరిన బుద్ధప్రసాద్ రాత్రికి అవనిగడ్డ చేరుకున్నారు. స్థానిక ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్న ఆయన వంతెన సెంటర్‌లోని దివంగత మండలి వెంకటకృష్ణారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వెంకట కృష్ణారావు విగ్రహానికి అధికారులు ముసుగు వేశారు. బుద్ధప్రసాద్ ఆ ముసుగు తొలగించి పూలమాల వేసిన తరువాత తిరిగి ముసుగు వేసేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు టీడీపీ నేతలు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కూటమిలో భాగంగా ఉన్న జనసేన నుంచి ఒక్క నాయకులు కానరాకపోవడం చర్చనీయాంశమైంది

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటరు చైతన్య యాత్ర రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్వో శ్రీదేవి

పామర్రు: బాధ్యత గల పౌరులుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిని బూసి శ్రీదేవి సూచించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికలు–2024 సందర్భంగా ఓటర్లకు అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఓటరు చైతన్య రథాలను ఆమె సహాయ ఎన్నికల అధికారులతో కలిసి జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఓటర్లను చైతన్య పరిచేందుకు, ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు ఓటర్ చైతన్య రథాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చైతన్య రథాలతో పాటు సాంస్కృతిక కళాకారుల బృందం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించకోవడం, స్వేచ్ఛగా ఓటు వేయడం అంశాలపై ప్రసారమాధ్యమాలు, కళారూపాలు, ఆట పాటలతో ఓటు విలువపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పామర్రు తహసీల్దార్ శ్రీ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



అయ్యంకి(మొవ్వ): సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని పామర్రు సర్కిల్, కూచిపూడి పోలీసుల ఆధ్వర్యంలో మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ ర్యాలీని నిర్వహించారు. గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, పామర్రు సీఐ సుభాకర్, కూచిపూడి ఎస్ఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో సెంట్రల్ ఆర్మెడ్ పోలీస్ దళాలతో కలిసి కవాతు నిర్వహించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తాం

- ఇప్పటి వరకు రూ.4.49 లక్షలు సీజ్ చేశాం
- 2,433 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నాం
- పెడన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకటరమణ



రిటర్నింగ్ అధికారి వెంకటరమణ

పెడన: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.వెంకటరమణ తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.4,49,280 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం తనిఖీలను ముమ్మరం చేసిందన్నారు. ఈ తనిఖీల్లో ఇప్పటి వరకు నగదుతోపాటు 2,433 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. మద్యం సీసాలు విలువ సుమారు రూ.2.18 లక్షలు ఉంటుందని వివరించారు. ఎవరైనా నగదు రూ.50 వేల లోపు మాత్రమే తీసుకెళ్లడానికి అనుమతులున్నాయని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభించి రాత్రి ఏడు గంటలకు ముగించాలని, ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థులు సహకరించాల్సిందిగా సూచించారు. 48 గంటల ముందు ప్రచారానికి అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని, సువిధ యాప్ ద్వారా లేదా లిఖిపూర్వకంగా స్వయంగా అందజేసినా సరిపోతుందని పేర్కొన్నారు. వాటిని తక్షణం పరిశీలించి నిబంధనలకు లోబడి ఉంటే తప్పనిసరిగా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. సీ–విజిల్ ద్వారా 31 ఫిర్యాదులు రావడంతో వాటిల్లో 26 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. అనుమతులు కోసం 38 దరఖాస్తులు వచ్చాయని, వాటిల్లో వాహనాలు, పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ తదితర వాటికి సంబంధించినవి అని వివరించారు. వాటిలో 24 దరఖాస్తులకు మాత్రమే అనుమతులు జారీ చేశామని తెలిపారు. తెలంగాణ రిజిస్ట్రేషన్ వాహనాలు, డ్రైవింగ్ లైసెన్సు లేని వాటికి, పన్నులు సక్రమంగా చెల్లించని, కండీషన్‌లో లేని వాటికి అనుమతులు ఇవ్వడం కుదరదని పేర్కొన్నారు. ఇలా వచ్చిన వాటిల్లో కొన్నిటిని, పోస్టర్లు అంటించడానికి ఇంటి యాజమాని అనుమతులు లేని వాటి దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు.

15వ తేదీ వరకు అవకాశం

మార్చి 30వ తేదీ కటాఫ్ తేదీతో తాజాగా ఓటర్ల జాబితా వస్తుందన్నారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు ఎంత మంది ఉన్నారనేది రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

వడ్డీ రాయితీతో రూ.3.62 కోట్లు వసూలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఆస్తి, ఖాళీస్థలాల పన్ను చెల్లింపుదారులకు మార్చి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీకి మంచి స్పందన వచ్చింది. మార్చి ఒకటి నుంచి 31వ తేదీ వరకు రూ.3,62,00,290 పన్నులు వసూలయ్యాయని మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వి.వి.ఎస్.బాపిరాజు మంగళవారం తెలిపారు. చివరి రోజైన 31వ తేదీన రూ.27,10,250 మేర వసూలైందని వివరించారు. బందరు నగర ప్రజలు వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని పేర్కొన్నారు.

కొనసాగిన వలంటీర్ల రాజీనామాలు

మచిలీపట్నంటౌన్: చంద్రబాబు కుట్రలతో తమను విధుల నుంచి తప్పించడంతో మనస్తాపానికి గురైన నగరంలోని వార్డు వలంటీర్ల రాజీనామాలు మంగళవారం కూడా కొనసాగాయి. నగరంలోని మొత్తం 823 మంది వలంటీర్లు ఉన్నారు. వారిలో సోమవారం 578 మంది రాజీనామా చేశారు. మంగళవారం మరో 100 మంది రాజీనామాలు సమర్పించారు.

చలివేంద్రం ప్రారంభం



మచిలీపట్నంటౌన్: నగరంలోని 38వ డివిజన్ సాయి డిస్కో డెకరేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మంగళవారం ప్రారంభించారు. వాసవీక్లబ్ వనిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం రానున్న 60 రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వేసవి కారణంగా పాదచారులు దాహార్తితో ఇబ్బంది పడకుండా ఉండేందుకు మజ్జిగ, తాగునీటిని చలివేంద్రంలో అందజేస్తామని పేర్కొన్నారు. క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ యెండూరి సురేష్, లక్ష్మీనృసింహ వైశ్య సమాజం అధ్యక్షుడు తాడేపల్లి మెహర్ బాబా, వాసవీక్లబ్ రీజినల్ చైర్ పర్సన్ శ్రీకాకోళపు రేణుకారాణి, 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా, జిల్లా ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వేముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భావన్నారాయణుడిని దర్శించుకున్న డాక్టర్ చంద్రశేఖర్



సంగమేశ్వరుని దర్శించుకున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, చరణ్

భావదేవరపల్లి(నాగాయలంక): వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం సాయంత్రం మండలంలోని భావదేవరపల్లి, సంగమేశ్వరం ఆలయాలను దర్శించుకున్నారు. తొలుత భావదేవరపల్లిలోని ప్రసిద్ధ శ్రీదేవి, భూదేవి సమన్విత శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణస్వామి ఆలయానికి వచ్చిన డాక్టర్ చంద్రశేఖర్‌కు ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, స్థానిక పార్టీ నాయకులు సాదర స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను తెలుసుకుని ఆయన తనయుడు రామచరణ్‌తో కలసి స్వామివారికి పూజలు జరిపారు. అవనిగడ్డ నియోజకవర్గం పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, చందు మురళి, భాగాది రాధాకృష్ణ తదితరులు అయన వెంట ఉన్నారు. అనంతరం చంద్రశేఖర్, రామచరణ్ సంగమేశ్వరం వెళ్లి అక్కడి చారిత్రిక ప్రసిద్ధి కలిగిన శ్రీగంగాపార్వతి సమేత శ్రీసంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు కొల్లిపర తిరుమల సాయిభార్గవ్ నేతృత్వంలో సంగమేశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపారు. సందర్భంగా పలువురు గ్రామస్తులు చంద్రశేఖర్‌ను కలసి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలుస్తామని చెప్పారు.

ఇంకా పింఛన్ ఇవ్వలేదయ్యా

ఎమ్మెల్యే సింహాద్రి ఎదుట వృద్ధుల ఆవేదన



అవనిగడ్డ బస్టాండ్‌లో వృద్ధులను పలుకరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రయాణికులతో ముచ్చటించారు. 'ఎలా ఉన్నారమ్మా? బాగున్నారా? అన్ని పథకాలు వస్తున్నాయా? అంటూ కొంత మందిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు మాట్లాడుతూ.. 'ఒకటో తారీఖు తెల్లవారు జామునే వలంటీర్లు పింఛన్ ఇచ్చేవారు. ఈ నెల రెండో తారీఖు వచ్చినా ఎవరూ రాలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు కుతంత్రాల వల్ల ఇలా జరిగిందని, పింఛన్లు ఇవ్వకుండా వలంటీర్లను అడ్డుకోవడం వల్లనే మీకు ఈ తిప్పలు వచ్చాయని, రెండు నెలలు ఓపిక పడితే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తారని, వలంటీర్లు ఇళ్లకు వచ్చి పింఛన్లు ఇస్తారని సింహాద్రి రమేష్‌బాబు భరోసా ఇచ్చారు. చంద్రబాబుకు ఓటేస్తే ఇంకెన్ని దారుణాలు చూడాలోనని కోడూరుకు చెందిన ఓ వృద్ధురాలు ఆందోళన వ్యక్తంచేసింది. పలువురు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపిస్తే.. ఇంటివద్దనే పింఛన్లు



పెదప్రోలులో ఓట్లు అభ్యర్థిస్తున్న వికాస్‌బాబు



ఎమ్మెల్యేగా రమేష్‌బాబు, ఎంపీగా డాక్టర్ చంద్రశేఖరరావును గెలిపించాలని కోరుతున్న నిశ్చల

మోపిదేవి: సామాజిక పింఛన్లను ఇంటివద్దనే అందుకోవాలంటే జగనన్నను మరోసారి గెలిపించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తనయుడు సింహాద్రి వికాస్‌బాబు, కుమార్తె నిశ్చల ప్రజలను కోరారు. మండలంలోని పెదప్రోలు, శివరామపురం గ్రామాల్లో వారు మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్‌బాబు, మచిలీపట్నం ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు గరికిపాటి వెంకటేశ్వరావు, జన్యావుల రామమోహనరావు, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరావు, రవికాంత్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు ఆది రాంబాబు, రావి రామ్‌ప్రసాద్, రెడ్డాతు వెంకట రమణ, తుటారం కృష్ణ, కోసూరు కోటేశ్వరావు, సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, బచ్చు దిలీప్, కందుల నాగభూషణం, రెడ్డమ్మ, ముత్యాల గోపాలరావు, రెడ్డాతు రాంప్రసాద్ పాల్గొన్నారు.

టెక్నికల్ ఈవెంట్‌లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: కేఎల్ యూనివర్సిటీ బీ–స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏ టెక్నికల్ ఈవెంట్ తార్కష్య – 24 వే టూ క్లియర్'లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పి.జె.ఎస్.కుమార్ మంగళవారం తెలిపారు. ఈ ఈవెంట్‌లో తమ కళాశాల ఎంబీఏ విద్యార్థులు ఎ.శ్యామ్ కిషోర్, ఎస్.సుబ్రహ్మణ్యం, జి. నాగపవన్, ఎస్. భానుప్రసాద్, షేక్ రుక్సానా ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పి.జె.ఎస్.కుమార్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ఎంబీఏ విభాగాధిపతి ఎంటీ సువర్చల, బీఎస్ఎస్ పద్మజ తదితరులు అభినందించారు.

భక్తులతో పోటెత్తిన వీరాంజనేయ ఆలయం



పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం పాల్గుణ మాసం చివరి మంగళవారం కావడంతో ఆలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి విశేషంగా ఆవుపాలు, పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. అనంతరం వడ మాల, పుష్పమాలతో స్వామిని పూజించి అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోనే పాల పొంగళ్లు వండి స్వామికి నివేదన సమర్పించి, మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్ సత్యవతి పాల్గొన్నారు.